సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 20 । జూన్ । 2023



ఉద్యోగాల పేరుతో వసూళ్లు?

కేటీపీఎస్ భూ నిర్వాసితుల పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ ముఠా ఐదారేళ్లుగా భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడింది. 8లో



కూరగాయలు కొనలేం..

జిల్లాలో వర్షాభావం వల్ల కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఎండల కారణంగా ఆశించిన మేర దిగుబడులు లేవు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 27

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జీకే ఓసీలో హరితహారం



మొక్క నాటుతున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీలో సోమవారం జరిగిన హరితహారం కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు కె.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఏరియా నూతన జీఎం షాలేమురాజు, అధికారులు కోటిరెడ్డి, రఘు రామిరెడ్డి, రమేష్, వెంకటేశ్వరరావు, మురళి, హరినారాయణ, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

విద్యా దినోత్సవంలో అవార్డులు..

కొత్తగూడెం అర్బన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ విద్యాదినోత్సవ కార్యక్రమం ఐడీఓసీలోనే నిర్వహించనున్నారు. మంగళవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 40 మందికి అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ విద్యార్థులు ముగ్గురికి, ఉత్తమ ప్రధానోపాధ్యాయులు 10 మంది, ఉత్తమ ఉపాధ్యాయులు 15, బెస్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు 5, బెస్ట్ పేరెంట్స్ 5, దాతల విభాగంలో అవార్డులు అందిస్తారు. 20న విద్యా దినోత్సవం, 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం, 22న అమరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ సోమవారం తెలిపారు. మంగళవారం విద్యా సంస్థల్లో పతాకవందనం చేయాలని, 21న ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని, 22న అమరులకు నివాళులర్పించాలని సూచించారు.

న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ



వివరాలను నమోదు చేసుకుంటున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో బాలబాలికల వసతులపై ఆరా తీశారు. ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరుచుకునేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ జి.నాగశ్రవంతి, జ్యోతి విశ్వకర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మణుగూరు డిగ్రీ కళాశాలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

మణుగూరురూరల్ : మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లియో ఇంటర్నేషనల్ అప్రిసియేషన్ అవార్డును కైవసం చేసుకుంది. లియో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు ఈ అవార్డు ఇచ్చారు. సికింద్రాబాద్‌లో జరిగిన లియో క్లబ్ ఇంటర్నేషన్ మల్టీబుల్–320 అవార్స్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌కు విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, లియో క్లబ్ చైర్‌పర్సన్ గోవింద రాజ్‌లు అవార్డు ప్రదానం చేశారు.

ఎటుపోయావు వానమ్మా..



- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు
- ముందుకు సాగని వానాకాలం పంట సీజన్
- నేలతడిస్తే తప్ప విత్తనాలు వేయొద్దని అధికారుల సూచనలు
- ఇప్పటికే పొడి దుక్కిలో పత్తి విత్తిన రైతుల్లో ఆందోళన

లోటు వర్షపాతం..

జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 225.3 మి.మీ నమోదు కావాల్సి ఉంది. ఇప్పటివరకు అక్కడక్కడా వర్షాలు పడగా 144.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 56.6 మి.మీ లోటు ఉందని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సూపర్‌బజార్(కొత్తగూడెం): జూన్ మాసం వచ్చి 20 రోజులు గడిచినా తొలకరి పలుకరించలేదు. ఎన్నో ఆశలతో సాగుకు సిద్ధమైన రైతు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నాడు. వరుణుడు కరుణించకపోవడంతో వానాకాలం పంట సీజన్ ఆరంభంలోనే నిరాశ చెందుతున్నాడు. ప్రకృతి విపత్తుల నేపథ్యంలో పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు రాష్ట్ర పభుత్వం ఈసారి వానాకాలం సీజన్‌ను ఒకనెల ముందుగానే ప్రారంభించాలని దిశా నిర్దేశం చేసింది. వ్యవసాయ, ఉద్యాన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రైతాంగాన్ని ఆ దిశగా చైతన్యం చేయాలని సూచించింది. చినుకు లేకపోవడంతో ముందస్తు మాటేమోకానీ ఎప్పటి లాగే రైతులు వానాకాలంలో వ్యవసాయ పనులు చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వరుణుడు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. యాసంగి ధాన్యం అమ్ముకోవడానికి నానా కష్టాలు పడ్డ రైతన్నలకు వానాకాలంలో అనావృష్టి వెంటాడుతోంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక ఎర్రనేలల్లో 50–60 మి.మీ., నల్లరేగడిలో 60–70 మి.మీ వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు సూచిస్తున్నారు. అయితే జిల్లాలో కొన్ని చోట్ల రైతులు వర్షం వస్తుందనే నమ్మకంతో పత్తి విత్తనాలు నాటి నష్టపోయారు. ప్రధానంగా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో కొందరు రైతులు పత్తి గింజలు వేశారు. వర్షాభావంతో అవి మొలకెత్తక చిత్తయ్యారు. వేసవి తీవ్రతకు నాటిన విత్తనాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఈసారి ఎండతీవ్రత విపరీతంగా ఉండటంతో జిల్లాలోని చెరువులు, కుంటలు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో జరిగిన చెరువుల పండుగలో ఈ విషయం స్పష్టంగా కనిపించింది. ఆయా నీటివనరులు ఉన్న ప్రాంతాలలో ఆయకట్టు రైతులు కూడా వరుణుడి దీవెనల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో గత వానాకాలం కంటే అదనంగా 72,398 ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కానీ వర్షాభావ పరిస్థితులతో సాగుకు ముందుకు సాగడంలేదు.

ఎదురు చూస్తున్నాం



వర్షాల కోసం ఎదురుచూపులు చూస్తున్నాం. వ్యవసాయ సీజన్‌లో వర్షాలు రాకుండా కష్టపడి పండించిన తర్వాత లేదా పంటలు చేతికొచ్చే సమయానికి వర్షాలు వచ్చి మమ్మల్ని నష్టపరుస్తున్నాయి. ఈ వర్షాకాలంలో మొదట్లోనే వర్షం రాక కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొంది.

–ప్రసాద్, రైతు, లక్ష్మీదేవిపల్లి

వర్షాలు వచ్చాకే విత్తుకోవాలి



వర్షాలు వచ్చిన తర్వాతే విత్తనాలు వేయాలి. ముందస్తుగా విత్తనాలు వేసి రైతులు నష్టపోవద్దు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఈ విషయాన్ని ప్రచారం చేశాం. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

–కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

హరితహారంతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, వేదికపై కలెక్టర్ అనుదీప్, పీఓ గౌతమ్, ఎస్పీ వినీత్, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, మెచ్చా తదితరులు

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు

చుంచుపల్లి: అడవుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంతో జిల్లాలో సత్ఫలితాలు వచ్చాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్కులో నిర్వహించిన తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవులు లేకపోతే మానవ మనుగడ లేదని, అందుకే హరితవనాలు సృష్టించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో ఎక్కడ చూసినా రహదారులు పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాయని పేర్కొన్నారు. జిల్లాలో సమర్థవంతమైన అధికార యంత్రాంగం ఉందన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ భావి తరాలకు మేలైన పర్యావరణ సంపదను అందించాలని సూచించారు. పల్లె, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటుతో చెట్లను నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇల్లెందులో చేపట్టిన చిట్టడవి పెంపకంతో ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వచ్చిందన్నారు. కొత్తగూడెం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు చేపట్టిన తెలంగాణ హరితహారం కార్యక్రమం మహా అద్భుతమైన పథకమని పేర్కొన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ అందరం కలిసి అటవీ సంపదను కాపాడుకోవాలని అన్నారు. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పోడు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వేడుకలకు ముందు అటవీ శాఖ ప్రగతి నివేదికను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఎస్పీ వినీత్, జిల్లా అటవీ అధికారి రంజిత్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, ఎంపీపీ భూక్యా సోనా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణే కేసీఆర్ లక్ష్యం



ఐడీఓసీలో మొక్క నాటి మట్టి పోస్తున్న కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: హరిత తెలంగాణే కేసీఆర్ లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. చుంచుపల్లి ధన్‌బాద్‌లో సోమవారం హరితహారాన్ని ప్రారంభించి కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటించేలా చూడాలన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఈ సారి హరితహారంలోనూ ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ.. బాధ్యత

సూపర్‌బజార్(కొత్తగూడెం): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం ఐడీఓసీలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, ఏఓ గన్యా, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత, డీపీఓ లక్ష్మీరమాకాంత్, ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: హరిత తెలంగాణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన రామవరంలోని శ్రీరామచంద్ర జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ అనుదీప్, చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, మున్సిపల్ కమిషనర్ రఘు, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, పారిశుద్ధ్య వర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు ఎప్పుడిస్తారో..?

- అంగన్‌వాడీల్లో గ్యాస్, స్టేషనరీ తదితర అవసరాలకు నెలకు రూ. 6 వేలు
- టీచర్ల వేతనంలో సగం కేంద్రాల నిర్వహణకే ఖర్చు
- ఏడాది కాలంగా పేరుకుపోతున్న బకాయిలు
- పట్టించుకోని ఐసీడీఎస్ ఉన్నతాధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న చిట్టి రామవరం అంగన్‌వాడీ కేంద్రం

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు బిల్లులు చెల్లించకపోవడంతో టీచర్లపై ఆర్థికభారం పడుతోంది. బిల్లుల మంజూరు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సివస్తోంది. ప్రతి నెలా వచ్చిన వేతనంలో సగానికి పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. కేంద్రాల నిర్వహణకు అద్దె చెల్లింపులు, గ్యాస్, ఈవెంట్, కూరగాయలు, పోషణ్ అభియాన్, స్టేషనరీ తదితర ఖర్చులు నెలకు సుమారు రూ. 6 వేలకు పైగా వస్తున్నాయని పేర్కొంటున్నారు. జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1,434, మినీ కేంద్రాలు 626.. మొత్తం 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి గ్యాస్ బిల్లు రూ.1200, ప్రతి నెలా 15 రోజులకు ఒక ఈవెంట్ చొప్పున రెండు ఈవెంట్లకు రూ.500, నెలకు సరిపడా కూరగాయలు రూ.600, మీటింగ్‌కు రూ.300, స్టేషనరీ ఖర్చులు ఏడాదికి రూ.1000తో పాటు పోషణ్ అభియాన్‌కు రూ.100ల చొప్పున నెలకు మొత్తం రూ.6,200 ఖర్చవుతోందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. అద్దె భవనాల్లో 785 కేంద్రాలు కొనసాగుతుండగా అద్దె బకాయి విడుదల చేయడం లేదు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు అద్దె నెలకు ప్రాంతాన్ని బట్టి రూ. 600, రూ.1500, రూ.2 వేలు. రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంది.

కేంద్రాల నిర్వహణపై ప్రభావం

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్‌కు సంబంధించి రూ.1,200 చొప్పున మూడు నెలల బిల్లు పెండింగ్‌లో ఉంది. ఈవెంట్ బిల్లులు 5 నెలకు రూ.2,500 చెల్లించాల్స ఉంది. ఆరోగ్యలక్ష్మి బిల్లు 3 నెలలుగా చెల్లించడంలేదు. కూరగాయల బిల్లు నెలకు రూ.600 చొప్పున ఏడాది నుంచి చెల్లించడంలేదు. జిల్లాలో 785 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో సెంటర్‌కు ఏరియాను బట్టి రూ.600 నుంచి రూ.3 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం 8 నెలలుగా అద్దె బకాయి చెల్లించడంలేదు. మీటింగ్ ఖర్చులు కూడా ఏడాది నుంచి ఇవ్వడం లేదని టీచర్లు వాపోతున్నారు. ఏడాదికాలంగా బకాయిలు చెల్లించకుండా ఉంటే తాము కేంద్రాలను ఎలా నడపాలని అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణపై ప్రభావం పడుతోందని చెబుతున్నారు.

బకాయి చెల్లించాలి

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు అయ్యే ఖర్చును మేము భరించాల్సి వస్తోంది. ఇలా ప్రతీ నెల జీతం ఖర్చు పెడితే మాకు కుటుంబ నిర్వహణ కూడా చాలా కష్టంగా ఉంటోంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మొత్తం మంజూరు చేయాలి.

–ప్రతిభా భారతి, మధురబస్తీ, అంగన్‌వాడీ సెంటర్

నెలలుగా ఎదురుచూపులు..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు మా జీతాల్లో నుంచి సగానికి పైగా ఖర్చు చేసి నెలలు తరబడి రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అద్దె, గ్యాస్ బిల్లులు, కూరగాయలు, ఈవెంట్, పోషణ్ అభియాన్ వంటి బిల్లులు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది కాలం నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

–గోనె మణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు

నిర్వహణకు ఇబ్బందులు

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఇంటి యజమానులు ఊరుకోవడం లేదు. మేము సొంతంగా ఖర్చు పెట్టి మళ్లీ పెండింగ్ బిల్లులు వచ్చేదాక ఎదురుచూడాల్సి వస్తోంది. నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

– శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్, చిట్టి రామవరం

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు..

కేంద్ర మంత్రి బీఎల్ వర్మ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

ఇల్లెందు/చుంచుపల్లి/భద్రాచలంటౌన్: విభజనలో మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులపాలు చేశారని కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ విమర్శించారు. రూ. 60 వేల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆరోపించారు. సోమవారం జిల్లాలో పర్యటించిన ఆయన ఇల్లెందు, భద్రాచలం ప్రాంతాల్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో, కొత్తగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ, అవినీతి పాలనను అంతమొందించాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌ను గద్దెనెక్కించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మే 30 నుంచి జూన్ 30 వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం సూచించిందని, ఈ క్రమంలోనే గ్రామగ్రామానా సభలు, సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో తెలంగాణకు నేషనల్ హైవేలు, మెడికల్ కాలేజీలు, విమానాశ్రయాలు, పరిశ్రమలకు వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రైతుల సంక్షేమం కోసం దేశ వ్యాప్తంగా ఫసల్ బీమా యోజన అమలు జరుగుతున్నా.. ఇక్కడ సీఎం కేసీఆర్ ఆ పథకాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. రూ. 5 లక్షల వరకు ప్రయోజనం జరిగే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా అడ్డుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు అమలు కావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కుంజా సత్యవతి, నాయకులు నాళ్ల సోమసుందర్, బలగానీ గోపీకృష్ణ, జి. రాంచందర్‌నాయక్, విమల్ జైన్, హతీరాం నాయక్, ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ఆకుల నాగేశ్వరరావు, ఎర్రం రాజు బెహరా, నాగబాబు, త్రినాధ్‌రావు, సతీష్, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ట్రైనీ ఎఫ్‌బీఓలు



హైదరాబాద్ ధూల్‌పేటలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35 మంది ట్రైనీ ఎఫ్‌బీఓలు సోమవారం కిన్నెరసాని అభయారణ్యాన్ని సందర్శించారు. జలాశయాన్ని, డీర్‌పార్కును తిలకించారు. అనంతరం మొక్కలు నాటారు. క్షేత్రస్థాయిలో అటవీ జంతువుల సంరక్షణ చర్యలపై యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. - పాల్వంచరూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ఎనిమిది నెలలుగా బిల్లులు మంజూరు చేయడం లేదంటూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ నెల 22, 23వ తేదీల్లో 36 గంటల నిరసన దీక్ష చేస్తామని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. - సూపర్‌బజార్(కొత్తగూడెం)

సింగభూపాలెంలో చేపల వేట..



తీవ్రమైన ఎండలతో మండలంలోని సింగభూపాలెం చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో మత్స్యకారులు ఇటీవల చేపల వేట నిలిపేశారు. చెరువులో ఎవరైనా చేపలు పట్టుకోవచ్చంటూ మత్స్య సొసైటీ సభ్యులు సోమవారం అనధికారికంగా ప్రకటించారు. ఇక పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా చెరువు వద్దకు చేరుకుని చేపలవేట సాగించారు. - సుజాతనగర్

క్లుప్తంగా

స్త్రీనిధి నిధుల గోల్‌మాల్‌పై విచారణ

డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు రంగంలోకి ఆడిట్ అధికారులు



విచారణ చేస్తున్న ఆడిట్ అధికారులు

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో స్త్రీనిధి నిధుల గోల్‌మాల్ ఉదంతం పై జిల్లా అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు ఆదేశాల మేరకు స్త్రీనిధి జిల్లా మేనేజర్ సంపత్, డీఆర్‌డీఏ సీబీఓ ఆడిటర్లు కిరణ్‌కుమార్, వీరభద్రం గ్రామంలో విచారణ చేపట్టారు. పోకలగూడెం క్లస్టర్‌లోని జైహనుమాన్ గ్రామసమాఖ్య ఆధ్వర్యంలోని మొత్తం 22 స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రూ.1.2 కోట్ల రుణమొత్తంపై ఆరా తీస్తున్నారు. ఇప్పటి వరకు చెల్లింపులు ఎలా చేశారు? ఇంకా ఎంత బకాయి ఉంది? అనే అంశాలపై విచారణ సాగుతోంది. మూడు నెలలపాటు సుమారు రూ.5.41 లక్షలు గోల్‌మాల్ అయినట్లు వచ్చిన ఆరోపణలపై క్షుణ్ణంగా రికార్డులు పరిశీలిస్తున్నారు. మూడు రోజులపాటు విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. విచారణలో ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 873 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 873 మంది అభ్యర్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్–23 కన్వీనర్ బి.నాగమునినాయక్ తెలిపారు. సోమవారం నాడు 181 మంది హాజరయ్యారని, వారంతా ఈ నెల 21 నుంచి వెబ్ఆప్షన్లు పెట్టుకోవచ్చని సూచించారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో 9 గంటల నుంచి వరుణహోమం, లక్ష కుంకుమార్చన, లలితా సహస్రపారాయణం, హరికథ, సాయంత్రం 5 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, దీపోత్సవం, పల్లకీ సేవ, ఉంజల్‌సేవ ఉంటాయని, ఆయా కార్యక్రమాలను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఘర్షణ ఆపేందుకు యత్నించిన వ్యక్తిపై దాడి

టేకులపల్లి: కుటుంబ సభ్యులు ఘర్షణ పడుతుండగా వద్దని చెప్పిన వ్యక్తి తలకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. తొమ్మిదోమైలుతండా పంచాయతీ తంగెళ్లతండాకు చెందిన ఇస్లావత్ కృష్ణ, ఇస్లావత్ శంకర్, ఇస్లావత్ భరణి కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఇస్లావత్ నగేశ్ మధ్యలో వెళ్లి గొడవను ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో శంకర్, కృష్ణ కర్ర తీసుకుని నగేశ్ తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన నగేశ్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. నగేశ్ భార్య శైలు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఇంట్లోకి దూసుకొచ్చిన లారీ



ఇంట్లోకి దూసుకుపోయిన లారీ

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర వద్ద ఓ లారీ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. ఇంట్లోని దిమ్మెలు అడ్డుపడటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం ఉదయం లక్ష్మీపురం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న ఓ లారీ మోరంపల్లిబంజర వద్ద అదుపుతప్పి చేతుల ఆనంద్ ఇంట్లోకి దూసుకుపోయింది. ఇంటి గోడలు, సిమెంట్ దిమ్మెలు అడ్డుపడటంతో ప్రమాద తీవ్రత తగ్గింది. అదే సమయంలో ఇంట్లోవారు వెనుక వైపున ఉండగా ముందు గదిలో ఆనంద్ కుమారుడు నిద్రిస్తుండగా స్వల్పంగా గాయపడ్డాడు. క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీడ్రైవర్, క్లీనర్‌లను స్థానికులు బయటకు తీసి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. లారీడ్రైవర్ తలకు గాయమవగా క్లీనర్ కాలు విరిగింది. ఎస్‌ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

కూరగాయలు వండుకొనలేం..

- వర్షాభావంతో తగ్గుతున్న దిగుబడులు
- ఆకాశానికి ఎగబాకుతున్న ధరలు
- కొనాలంటేనే సామాన్యుడు బెంబేలు



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇల్లెందురూరల్: జిల్లాలో వర్షాభావం వల్ల కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఏ కూరగాయలు కొనాలన్నా అమాంతం వాటి ధర పెరిగిపోవడంతో అన్ని వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటి వరకు ఎండల కారణంగా కూరగాయల దిగుబడులు ఆశించిన మేర లేవు. వర్షాకాలం ప్రారంభమైనా వరుణుడి కరుణ లేకపోవడంతో వాటి ఉత్పత్తి తగ్గి ధరలు చుక్కల సరసన చేరాయి. విపణిలో వాటిని కొనుగోలు చేయడానికి వెళ్లిన వారికి ధరలు చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే ధరలు ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలే నిత్యావసర ధరలు నింగినంటుతుంటే కనీసం కూరగాయలు తినే పరిస్థితి లేకపోవడంపై వంటింటి గృహిణులు పెదవి విరుస్తున్నారు.

12 వేల ఎకరాల్లో సాగు

టమాట ధర అప్పుడే కిలో రూ.40 నుంచి రూ.50 వరకు పెరిగిపోయింది. బీరకాయలు కిలో రూ.80, చిక్కుడుకాయలు కిలో రూ.100 వరకు పలుకుతున్నాయి. నాలుగైదు రకాలు తప్ప ప్రతి కూరగాయ ధర కొండెక్కుతోంది. జిల్లావ్యాప్తంగా ఏటా 12 వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతాయని ఉద్యానశాఖ అధికారులు చెపుతున్నారు. వర్షాకాలంలో 6 వేల ఎకరాల్లో.. వేసవిలో 2,500 ఎకరాల్లో.. చలికాలంలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు కూరగాయల పంటలను సాగుచేస్తుంటారని పేర్కొంటున్నారు. ఉద్యాన పంటల్లో అంతర్‌పంటగా కొందరు, సీజన్‌కు అనుగుణంగా కూరగయాల సాగు చేసే రైతులు మరికొందరు ఉన్నారని వివరిస్తున్నారు.

కూరగాయలు సాగయ్యే గ్రామాలివే..

జిల్లాలో ఇల్లెందు మండలంలోని కొమరారం, పోచారంతండా, పోలారం, మాణిక్యారం, రేపల్లెవాడ, రాఘబోయినగూడెం తదితర గ్రామపంచాయతీల నుంచి కూరగాయలు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతుంటాయి. ఆ తరువాత అశ్వారావుపేట మండలంలో సాగవుతున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, తిప్పనపల్లి, మాచినేనిపురం, వినోభానగర్, గుండ్లరేవు, సుజాతనగర్, సింగభూపాలెం, రాఘవాపురం, బంగారుచెలక, జగన్నాథపురం, జగ్గారం, అశ్వాపురం, ఇరవండి, పట్టీనగర్, చిన్నబండరేవు, పెద్దబండరేవు, దుమ్ముగూడెం, గుమ్మారం, తీగలేరు, జానంపాడు, కరకగూడెం, సంపత్‌నగర్, ఆళ్లపల్లి, మామకన్ను తదితర గ్రామాల్లో సాగుచేస్తుంటారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

వర్షాకాలం ప్రారంభమైనా సరైన రీతిలో వర్షాల్లేక కూరగాయల పంటలు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం ఉన్న సాగు విస్తీర్ణం జిల్లా అవసరాలకు ఏమాత్రం సరిపోదు. చాలా వరకు కూరగాయలను ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. టమాట మదనపల్లి నుంచి, మిర్చి బాపట్ల నుంచి.. ఇలా పలు చోట్ల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. అయితే స్థానికంగా లభ్యమయ్యే కూరగాయల ధరలు కూడా తక్కువేం లేకపోవడం గమనార్హం.

ఎందుకీ పరిస్థితి

జనాభా అవసరాలకు అనుగుణంగా కూరగాయల ఉత్పత్తికి అవసరమైన ప్రోత్సాహం రైతులకు అందడం లేదు. కనీసం ఉప ఉత్పత్తులపైనన్నా ప్రజలను పూర్తిస్థాయిలో అధికారులు చైతన్యం చేయడం లేదు. 12 వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నా జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా కూరగాయలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజ్ లేదు. పండించిన పంట మార్కెట్‌కు తప్ప నిల్వ చేసుకునేందుకు వేరే మార్గం కనిపించడం లేదు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కానీ ఏఒక్క కమిటీ కూడా కూరగాయలు నిల్వ చేసేందుకు కూల్‌చాంబర్ల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వలేదు. జిల్లాలో ఎక్కువగా చిన్న కమతాల్లోనే కూరగాయలు పండిస్తున్నారు. హెక్టార్ల కొద్ది విస్తీర్ణంలో సాగు జరగడం లేదు.

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు

కూరగాయలు	ధర (రూ.ల్లో)
టమాట	50
బెండకాయ	40
వంకాయ	40
బీరకాయ	80
దోసకాయ	40
సొరకాయ	20
గోరుచిక్కుడు	60
చిక్కుడు	100
దొండకాయ	40
ఆలుగడ్డ	30
మిర్చి	100
క్యారెట్	80
చామగడ్డ	80
బుడమదోసకాయ	60
క్యాబేజీ	40
కాకర	50



ఏం కొంటాం.. ఏం తింటాం..?



సంచి పట్టుకొని విపణికి వెళితే రూ.వంద నోటు ఖర్చుయిపోతోంది. సంచినిండా కూరగాయలు రావడం లేదు. చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. ధరలన్నీ మండిపోతున్నాయి. కూరగాయలు కూడా మినహాయింపు కాదు. ఇలాగైతే ఏం కొంటాం.. ఏం తింటాం..? పప్పుల ధరలు కూడా పెరిగాయి. ఇక నీళ్ల చారే గతవుతోంది.

– యదళ్లపల్లి సావిత్రి, మాణిక్యారం

దిగుబడి తగ్గడం వల్లే..



ఏటా వేసవిలో కూరగాయల ధరలు పెరగడం సహజమే. ఈసారి వేసవి ముగిశాక జూన్‌లో కూడా ధరలు మరింతగా పెరిగాయి. సకాలంలో వర్షాలు కురవడం లేదు. నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అందువల్లే ధరలు కొంత పెరిగాయి.

–జానీ, హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి, ఇల్లెందు

ఆరోగ్య సమస్యలు వస్తాయి..



కూరగాయల ధరల్లో పెరుగుదల వల్ల వినియోగం తగ్గుతోంది. దీంతో శరీరానికి అవసరమైన విటమిన్లు, ఇతర పోషకాలు అందవు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మనిషికి అవసరమైన పోషకాలు అందించడానికి వీలుగా కూరగాయలను నిత్యం ఆహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. – **డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ**

ఉద్యోగాల పేరుతో వసూళ్లు?



పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

- కేటీపీఎస్ యాష్ పాండ్ కింద భూములు అక్రమంగా విక్రయం
- భూ నిర్వాసితులుగా చూపిస్తామని నమ్మబలికిన ముఠా
- వందలాది మంది నుంచి రూ.5 కోట్ల వరకు వసూలు
- పోలీస్ స్టేషన్‌కు చేరిన బాధితులు

పాల్వంచ: కేటీపీఎస్ భూ నిర్వాసితుల పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ ముఠా ఐదారేళ్లుగా భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడింది. ఓ ప్రధాన కార్మిక సంఘం నేతకు అనుచరుడిగా, బినామీగా చలామణి అయిన సదరు వ్యక్తి కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని అక్రమంగా రూ.కోట్లను దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాలు ఇవ్వక పోవడంతో బాధితుల నుంచి కొంతకాలంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చివరికి బాధితులు కొందరు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు వేడుకుంటున్నారు. కాగా, ఇటీవల బీటీపీఎస్ ఉద్యోగి (గతంలో కేటీపీఎస్), ఓ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయిన నేత పలువురి నుంచి రూ.లక్షలు దండుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో మరో ముఠా చేసిన వసూళ్ల విషయం వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

యాష్ పాండ్ కింద పోయిన భూముల పేరుతో కథ!

కేటీపీఎస్ 7వ దశకు చెందిన యాష్ పాండ్ (బూడిద చెరువు) కింద కొన్ని భూములు పోయాయని, ఆ భూములకు సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని మీరు కొనుగోలు చేసినట్లు కోర్టులో వేసి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామని నటరాజ్ సెంటర్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి భారీ వసూళ్లకు తెరలేపాడు. అయితే ఇందులో ఎంతో నేర్పుఉన్న సదరు వ్యక్తి నేరుగా తాను డబ్బులు తీసుకోకుండా సుమారు ఏడెనిమిది మంది ఏజెంట్లను తయారు చేసుకుని ఐదారేళ్లుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. ఈ క్రమంలో వందలాది మంది వీరి వలలో చిక్కినట్లు అంచనా. అయితే, ఆ భూములకు సంబంధించిన అసలు పట్టాదారుల పేర్లు అనాదిగా రెవెన్యూ రికార్డుల్లో వస్తున్నట్లు సమాచారం. కాగా వారు భూమిపై లేకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో తప్పుడు పద్ధతుల్లో పేర్లు ఐదారేళ్ల కిందటే చేర్చినట్లు సమాచారం. ఈ భూములు యాష్ పాండ్ కింద పోయినట్లు చూపి కోర్టులో వేసి కోర్టు నుంచి ఆదేశాలు రాగానే ఉద్యోగాలు వస్తాయని నమ్మబలికినట్లు సమాచారం.

కనిపించకుండా పోయిన ఏజెంట్

వీరి వలలో పాల్వంచ, కొత్తగూడెం జిల్లాలోని అనేక ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నారు. ముఖ్యంగా అతని సామాజిక వర్గానికి చెందిన వారే అధికులు కావడం గమనార్హం. కొత్తగూడెంనకు చెందిన ఓ ఏజెంట్ ఐదారు నెలలుగా కనిపించకుండా పోయాడు. కాగా అతని సోదరుడు పాల్వంచలో ఓ కార్యక్రమానికి రావడంతో అతడిని ఇక్కడి బాధితులు పట్టుకున్నారు. తాము రూ.లక్షలు ఇచ్చామని తమ డబ్బులు ఇప్పించాలని అతడిని నిలదీసి, పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయమై ఎస్‌ఐ కె.నరేశ్‌ను వివరణ కోరగా బాధితులు కొందరు విషయాన్ని తమ దృష్టికి తెచ్చారని, వారి వద్ద ఉన్న ఆధారాలతో ఫిర్యాదు చేయమని చెప్పామని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి..

మూడురోజుల తరువాత గుర్తించిన స్థానికులు

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో మూడు రోజుల కిందట వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతిచెందగా స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. భద్రాచలం పట్టణానికి చెందిన బూరుగు భాస్కర్ (42) కుటుంబ కలహాలతో రెండున్నరేళ్లుగా నాగినేనిప్రోలులో ఒంటరిగా ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత శనివారం గ్రామ సమీప పొలంలో సమాధిపై పడుకున్నాడు. వడదెబ్బకు గురై మృతిచెందగా సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు అటువైపు వెళ్లి పరిశీలించగా సమాధిపై ఓ మృతదేహం బాగా ఉబ్బి కనిపించింది. వడదెబ్బతోనే అతను మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనారోగ్యంతో రామాలయ అర్చకుడు మృతి



గోపాలకృష్ణమాచార్యులు (ఫైల్)

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న పొడిచేటి గోపాలకృష్ణమాచార్యులు (63) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉంది. కాగా, ఆయన కుమారుడు పొడిచేటి అచ్చుతాకుమారాచార్యులు దేవస్థానంలో పరిచారక అర్చకుడిగా పనిచేస్తుండగా, కుమార్తె ఉంది. గోపాలకృష్ణమాచార్యులు మృతి పట్ల ఆలయ ఈఓ రమాదేవితో పాటు ఆలయ ఉద్యోగుల, అర్చక సంఘాల బాధ్యులు సంతాపం తెలిపారు.

భర్త చనిపోయిన వారంలోనే...



పద్మ (ఫైల్)

పాల్వంచ: భర్త చనిపోయిన వారం రోజుల వ్యవధిలోనే భార్య కూడా మృతి చెందింది. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. స్థానికుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు గ్రామానికి చెందిన ఉప్పుతల విశ్వనాథం బ్రెయిన్ స్ట్రోక్‌తో గత మంగళవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భార్య పద్మ మరింత ఆవేదనకు గురై సోమవారం మృతి చెందింది. వారం రోజుల వ్యవధిలోనే కుటుంబ పెద్దలు ఇద్దరు మృతి చెందారు. మృతుడికి కుమారులు ఉప్పుతల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కూతురు ఉన్నారు. పద్మ మృతదేహాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పలువురు సందర్శించి నివాళులర్పించారు.

ప్రథమ పౌరుడే వంట కార్మికుడై..

బోధించాల్సిన ఉపాధ్యాయులు సైతం..



ఆసుపాక స్కూల్లో వంట చేస్తున్న సర్పంచ్ లింగయ్య, కూరగాయలు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయినులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే కార్మికులంతా బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మూకుమ్మడిగా ధర్నాకు దిగారు. వంట కార్మికులు ధర్నాలో ఉండటంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం బంద్ అయింది. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధన పక్కన పెట్టి విద్యార్థులకు భోజనాలు సిద్ధం చేయగా, మహిళా ఉపాధ్యాయులు వంటా వార్పు చేశారు. ఇంకొన్ని పాఠశాలల్లో కొంతమంది ఇళ్ల వద్ద నుంచే భోజనాలు తెచ్చుకోగా, మరికొన్ని చోట్ల విద్యార్థులు ఇళ్లకు వెళ్లి ఆకలి తీర్చుకున్నారు. అశ్వారావుపేట మండలంలోని ఆసుపాక గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు కూరగాయలు సిద్ధం చేయగా, ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ కునసోతు లింగయ్య గరిట పట్టుకొని మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసి విద్యార్థులకు పెట్టారు.

తొలగించిన ఆర్టిజన్లకు పోస్టింగ్

దూర ప్రాంతాల్లో నియామకం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఇటీవల తొలగించిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకొని పోస్టింగ్ ఇస్తున్నారు. సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేయాలని, విద్యార్హత ఆధారంగా కన్వర్షన్ ఇవ్వడమే కాక 50 శాతం పీఆర్సీ అమలు చేయాలనే తదితర డిమాండ్లతో ఏప్రిల్ 25న తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్–82, ఈతేహైద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్లు సమ్మెకు దిగాయి. ఈ క్రమంలో అత్యవసర సేవల విభాగం కిందకు వచ్చే విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మె చేయడం చట్టవిరుద్ధమని యజమాన్యం ప్రకటించినా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఎన్పీడీసీఎల్ ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ పరిధిలో సమ్మెలో పాల్గొన్న నలుగురు, ట్రాన్స్‌కోలో పనిచేసే ముగ్గురితో పాటు పాల్వంచ జెన్‌కోలో పనిచేసే ముగ్గురిని అప్పట్లో ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే, సమ్మె విరమించాక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో జరిగిన చర్చల్లో తొలగించిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సమ్మతించారు. ఈ క్రమంలోనే వారిని విధుల్లో తీసుకున్నా ప్రస్తుతం పనిచేసే ప్రాంతాల్లో కాక దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్‌లో తొలగించిన నలుగురు ఉద్యోగుల్లో ఇద్దరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, ఒకరిని మహబూబాబాద్, ఇంకొకరికి వరంగల్ జిల్లాల్లో పోస్టింగ్ ఇస్తూ ఎన్పీడీసీఎల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ట్రాన్స్‌కో నుంచి తొలగించిన ముగ్గురిలో ఇద్దరికి జూలూరుపాడు డివిజన్‌కు, మరొకరికి సీతారాంపట్నం(పాల్వంచ)లో పోస్టింగ్ ఇచ్చారు. ఇక పాల్వంచ జెన్‌కోలో పనిచేసే ముగ్గురికి శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఇక ఆయా ప్రాంతాల్లో సమ్మెలో పాల్గొని ఉద్యోగాల నుంచి తొలగించబడిన వారిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాకు నిజామాబాద్ జిల్లా ఆర్టిజన్లను కూడా కేటాయించగా వారు విధుల్లో చేరుతున్నారు. ఏప్రిల్ 25 నుంచి తొలగించబడిన ఆర్టిజన్లకు 50 రోజులకు పైగా వేతనాలు నిలిచిపోగా, ఇప్పుడు వారు విధుల్లో చేరటంతో వేతనాలు అందే అవకాశం ఉంది.

బీసీ హాస్టల్‌లో శాఖ అధికారి తనిఖీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి ఇందిర తనిఖీ చేశారు. హాస్టల్‌లో రికార్డులను పరిశీలించారు. హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, నూతన అడ్మిషన్ల వివరాలను వార్డెన్ నరసింహారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు.


మోడల్ కెరీర్ సెంటర్‌లో రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగ యువత కోసం ఈనెల 21న టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. టాటా క్యాపిటల్ ఫైనాన్సియల్ సర్వీసెస్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 125 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వయస్సు ధృవీకరణపత్రాలు, విద్యార్హతలు, అనుభవం సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా...

అవినాశ్ రెడ్డి బెయిలు రద్దుపై విచారణ వాయిదా

- 3కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- కౌంటర్ల దాఖలుకు అవినాశ్, సీబీఐకి నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య తదనంతర పరిణామాలు, సీబీఐ దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ కావడం వంటి అంశాలను న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ నెల 30 నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అప్పటికల్లా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అవినాశ్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకొని సీజేఐ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను కూడా జత చేసి జూలై 3న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని కోర్టు ఆదేశించింది.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారిలో బీడ్ జిల్లా బీజేపీ కార్యదర్శి మయూరి ఖేద్కర్, ఔరంగాబాద్ జిల్లా ఎన్సీపీ కార్యదర్శి సతీష్ బచాటే, పుణే విధానసభ మాన్సే అధ్యక్షుడు చంద్రకాంత్ సిమ్లా, పుణే మాన్సే యువక్ ఆఘాడీకి చెందిన కళ్యాణ్ కుమార్, చిరంజీవి రాంరావు, జై భగవాన్ మహాసంఘ్ యువ తాలూకా అధ్యక్షుడు పరమేశ్వర్ కేదార్, సర్పంచ్‌లు మహాదేవ్ జవహరే, శరద్ సిర్సాట్, సంజయ్ కేదార్, గణేష్ జయభాయే, భగవాన్ జయభయే, విష్ణు సనప్, సంతోష్ బడే, అర్బాజ్ షేక్ తదితరులున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు మాణిక్ కదమ్ తదితరులున్నారు.



నా‘నో’ యూరియా!

లిక్విడ్ యూరియా వాడకంపై ఆసక్తి చూపించని రైతులు

- అర లీటర్ నానో యూరియా 45 కేజీల సాధారణ యూరియాతో సమానం
- భూసార పరిరక్షణ.. ధర తక్కువ..పంటల దిగుబడి ఎక్కువ
- అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వ్యవసాయ అధికారులు

భూసారం దెబ్బతినదు. ధర తక్కువ.. లాభాలు కూడా ఎక్కువ. ఇలాంటి ప్రయోజనాలెన్నో ఉన్నా, నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. నానో యూరియా వ్యవసాయ రంగంలోనే కొత్త విప్లవానికి నాంది అని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం దానికి ఆశించినంతగా ఆదరణ లభించడం లేదు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ వర్గాలు విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

\- సాక్షి, హైదరాబాద్

లాభాలు ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

కేవలం అర లీటర్ లిక్విడ్ యూరియా (నానో).. 45 కేజీల సాధారణ యూరియాతో సమానం. సాధారణ ఘన రూపంలోని యూరియా కంటే నానో లిక్విడ్ యూరియాతో లాభాలు ఎక్కువ ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న యూరియాతో భూమికి హాని జరగడంతో పాటు భూసారం తగ్గుతోందని పలు నివేదికలు తెలుపుతున్నాయి. దీంతో పాటు 45 కిలోల బరువుండే యూరియా బస్తాను ఎరువుల దుకాణం నుంచి పొలం వరకు తీసుకెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో యూరియా వాడకాన్ని తగ్గిస్తూ, భూసారాన్ని దెబ్బతీయకుండా ఉండడంతో పాటు ఘన యూరియాతో పోల్చితే లాభాలు అధికంగా వచ్చేలా నానో యూరియా రూపుదిద్దుకుంది. అయితే దీనిపై రైతులు గందరగోళంలో ఉన్నారు. సాధారణ యూరియాకు అలవాటు పడడం వల్ల కూడా రైతులు నానో యూరియాను వినియోగించడానికి అంతగా ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

నానో యూరియాపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ ధర, అధిక దిగుబడి లాంటి అంశాలను రైతుల్లో ముమ్మర ప్రచారం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామన్నారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో పలువురు రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, తర్వాత క్షేత్రస్థాయిలో పొలాలు, రైతు వేదికల వద్ద సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో 8 లక్షల బాటిళ్ల నానో యూరియాను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ ఎరువుల ప్రణాళికలో ప్రకటించింది.

రూ. 60 తక్కువ..

500 ఎంఎల్ నానో యూరియా బాటిల్‌లో 40 వేల పీపీఎంల నైట్రోజన్ ఉంటుంది. లిక్విడ్ యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. ఈ యూరియాను పత్తి, మొక్కజొన్న తదితర 94 పంటల మీద పిచికారీ చేయొచ్చు. కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుంది. అంతే కాదు దీని వాడకం వల్ల పంట దిగుబడి సాధారణ యూరియా కంటే 8% పెరుగుతుందని అంచనా. సబ్సిడీలు పోనూ యూరియా బస్తా ధర రూ.266 ఉండగా... నానో యూరియా బాటిల్ రూ.204కే లభిస్తోంది. అర లీటర్ నానో యూరియాకు సుమారు 127 లీటర్ల నీటిని కలిపి చల్లొచ్చు. రవాణాకు, నిల్వకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయినా చాలావరకు రైతులు ఆసక్తి చూపించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఫెర్టిలైజర్ షాపు యజమానులు 4 యూరియా బస్తాలు కొనుగోలు చేసిన రైతులకు నానో లిక్విడ్ యూరియాను బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

‘ఉపా’ను రాష్ట్రంలో ప్రయోగించబోమని ప్రకటించాలి

- కేంద్రంలో కూడా ఎత్తేసేలా ప్రయత్నించాలి
- రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: ప్రొ.హరగోపాల్



పంజగుట్ట: ఉపా చట్టాన్ని రాష్ట్రంలో ఉపయోగించబోమనీ, కేంద్రంలోనూ ఎత్తేసేలా ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ కోరారు. ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకవచ్చు.. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ అని నిరూపించుకోవాలి అని సూచించారు. ప్రజాసంఘాల స్వేచ్ఛను, మాట్లాడే హక్కును దూరం చేస్తున్న అన్యాయమైన ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఉపా చట్టం కేసులను ఆరుగురిపై రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరుగురిలో నలుగురు ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ గుంట రవి సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. తమపై నమోదైన కేసులే మిగిలిన 146 మందిపై కూడా ఉన్నప్పుడు వారిపై కేసులు ఎందుకు ఎత్తివేయలేదని ప్రశ్నించారు.

21 నుంచి దశల వారీ ఆందోళన

తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 21 నుంచి 25 వరకు సీఎం, మంత్రులకు వినతిపత్రాలు ఇస్తామని, జూన్ 26 నుంచి జూలై 29 వరకు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని, జూలై 30న హైదరాబాద్‌లో ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో బహిరంగ సభ నిర్వహిస్తామని హరగోపాల్ తెలిపారు.

దేవేందర్‌ను విడుదల చేయాలి

సిద్దిపేటలో పరీక్ష రాస్తుండగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లిన దేవేందర్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేవేందర్ గతంలో దేశభక్త ప్రజాతంత్రలో పనిచేసింది వాస్తవమే అయినా ఇప్పుడు దానికి దూరంగా ఉన్నాడని తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు అవుతున్నందున వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో కలిసేది బీఆర్ఎస్సే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వస్తుందన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎందుకోసం నిర్వహిస్తున్నారని.. ప్యాలెస్ లాంటి ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నందుకా, వేల కోట్లు సంపాదించుకున్నందుకా అని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లేకుండా చేస్తున్న బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడేందుకు, సమస్త తెలంగాణ ప్రజల కోసం తాను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్నానని చెప్పారు. ధరణి వల్ల భూమిపై హక్కులు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తామన్నారు.

కృష్ణా జలాలను నల్లగొండకు తరలించాలి

తనది గమ్యం లేని పాదయాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అంటున్నారని.. కృష్ణా జలాలను నల్లగొండ జిల్లాకు తరలించాలనేదే తన ఆశయమన్న విషయం గుత్తా తెలుసుకోవాలని భట్టి సూచించారు. చెమట బిందువులను ఓట్లుగా మార్చి నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఆ ఎమ్మెల్యే ప్రలోభాలకు లోనై పార్టీ మారాడని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తెచ్చారని.. అప్పట్లో కాంగ్రెస్ సర్కారు రూ.348 కోట్లను ప్రాజెక్టుకోసం ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో అసెంబ్లీ షెడ్యూల్!

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించాయి. ఈ మేరకు 74 మంది డిప్యూటీ కలెక్టర్లు (ఇటీవలే పదోన్నతి పొందిన వారితో కలిపి), 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనికి వచ్చే అన్ని మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది.

ఏఆర్‌వోల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు

నామినేషన్ల ప్రక్రియతోపాటు పోలింగ్ సామగ్రి సమకూర్చుకోవడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేయడం, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాల కల్పన వంటి ఏర్పాట్లన్నీ ఏఆర్‌వోల పర్యవేక్షణలో జరగనున్నాయి. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో భాగంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఏఈఆర్‌వో) అధికారులుగా తహసీల్దార్లు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉండటంతో, ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు మార్చి 5–15వ తేదీ మధ్య షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని చెప్తున్నాయి.

2018లో ముందస్తు ఎన్నికలతో..

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటు 2019 ఏప్రిల్–మే నెలల్లో జరగాలి. కానీ రాష్ట్రంలో రాజకీయ కంగాళీ వాతావరణం ఏర్పడిందని.. తనను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంటూ.. సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. 2018 సెప్టెంబర్ 6న ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ కేబినెట్‌లో తీర్మానించి.. అప్పటి గవర్నర్‌ను నరసింహన్‌కు అందజేయడం, ఆయన వెంటనే ఆమోదించడం, అదే రోజున 105 మంది బీఆర్ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించడం చకచకా జరిగాయి. అప్పుడు దేశంలో మరో నాలుగు రాష్ట్రాలకూ ఎన్నికల సమయం కావడంతో.. వాటితో పాటు తెలంగాణనూ కలిపి అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీకాగా డిసెంబర్ 7న పోలింగ్, 11న ఓట్ల లెక్కింపు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ సీట్లు గెల్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఈసారి అదే సమయంలో..!

ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2018లో జరిగిన 5 రాష్ట్రాల్లో ఎన్నికల్లో భాగంగా.. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 12, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో నవంబర్ 28న, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఈసారి కూడా ఐదు రాష్ట్రాల పోలింగ్ ప్రక్రియ డిసెంబర్ 5–9 తేదీల మధ్య ముగిసే అవకాశాలు ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా అక్టోబర్ రెండో వారంలోనే షెడ్యూల్ రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

మరికొందరు కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మరికొంత మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. మే, జూన్ నెలల్లో ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాల విద్యాబోధనలో ఉన్న 3,897 కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇప్పుడు వారంతా రెగ్యులర్ ఉద్యోగులైపోయారు. అయితే సరైన అర్హతలు లేనికారణంగా కొంతమందిని క్రమబద్ధీకరించలేదు. కొంతమంది డిస్టెన్స్‌లో డిగ్రీ చదివినవాళ్లు, రాష్ట్రంలోని బయటి రాష్ట్రాల స్టడీ సెంటర్లలో చదివినవారూ ఉన్నారు. వీరేకాకుండా కొన్ని పోస్టుల మంజూరు లేకుండా లెక్చరర్లను నియమించారు. మరికొన్ని చోట్ల మంజూరైన పోస్టు సబ్జెక్టు ఒకటయితే.. మరో సబ్జెక్టు బోధించే అధ్యాపకులు పని చేస్తున్నారు. డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీ తప్పనిసరి కాగా, ఈ అర్హతలు లేని వారిని నియమించారు. అయితే తాజాగా ఈ అర్హతలను సాధించడంతో వీరందరి వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఆమోదిస్తే, వీరిని సైతం క్రమబద్ధీకరించే అవకాశాలున్నట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో కేంద్ర మంత్రి



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ రమాదేవి


భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార, సహాయ కేంద్ర మంత్రి బీఎల్ వర్మ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. బీజేపీ నాయకులు కోనేరు చిన్ని, కుంజా సత్యవతి పాల్గొన్నారు.

ఖమ్మంలో పూజలు

ఖమ్మం మామిళ్లగూడెం: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ ఖమ్మంలోని శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు అల్లిక అంజయ్య, దావా కిరణ్, కుమిలి శ్రీనివాస్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ రేగాకు తప్పిన ప్రమాదం

కాన్వాయ్‌కు అడ్డుగా ట్రాక్టర్ రావడంతో ఢీకొన్న వాహనాలు



ప్రభుత్వ విప్ కాన్వాయ్‌లో దెబ్బతిన్న వాహనాలు

బూర్గంపాడు: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం బయలుదేరారు. బూర్గంపాడు మండలం ముసలిమడుగు మీదుగా వెళ్తున్న ఆయన కాన్వాయ్‌కు ట్రాక్టర్ అడ్డురావటంతో పైలెట్ వెహికిల్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో కాన్వాయ్‌లోని వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో విప్ ప్రయాణిస్తున్న వాహనం కూడా ముందు వాహనాన్ని ఢీకొన్నా డ్రైవర్ల సమయస్ఫూర్తితో ఎవరికి ఏమీ కాలేదు.

‘సీతారామ’ నీళ్లు ఇవ్వాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్డీ శ్రేణులు

- బయ్యారంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి
- ఎన్డీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీరు ఇవ్వాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన సోమవారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించారు. కార్యాలయాలు తెరుచుకున్నప్పటి నుంచి రెండు గంటల పాటు గేట్లు మూసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొచ్చి రిజర్వాయర్‌గా చేస్తామని సీఎం కేసీఆర్ రోళ్లపాడులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. ఇప్పుడు చెరువుకు గోదావరి జలాలు రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా పెద్దచెరువుపై ఆధారపడిన బయ్యారం, గార్ల మండలాలకు చెందిన వేలాది మంది రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నా స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నోరు విప్పకపోవడం సరికాదన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువు అభివృద్ధిని పాలకులు విస్మరించారని మండిపడ్డారు. ఇప్పటికైనా బయ్యారం పెద్దచెరువుకు సీతారామ నీటిని తీసుకొచ్చి మండలంలోని ఏజెన్సీ గ్రామాల రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాక చెరువు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. కాగా, కార్యాలయాలను ముట్టడించిన ఎన్డీ నాయకులను ఎస్‌ఐ రమాదేవి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, భిక్షం, పద్మ, పొమ్మయ్య, వీరభద్రం, మధు, నర్సింహ, నాగేశ్వరరావు, సమ్మయ్య, కొమురయ్య, లింగన్న, రాంబాబు, కోటమ్మ, అరుణ, మంగీలాల్, ప్రభాకర్, లింగమల్లు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- రేపు ఆలయాల అలంకరణ, ప్రత్యేక పూజలు
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఏసీ సులోచన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సులోచన, పక్కన ఉద్యోగులు, అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేసేలా అందరూ కృషి చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన సూచించారు. ఖమ్మంలోని శ్రీగుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని దేవాలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించడమే కాక సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాలని కోరారు. అలాగే, భక్తులు ఆలయాలకు వచ్చేలా చూడాలని తెలిపారు. ఆలయాల్లో భక్తికి సబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలని చెప్పారు.

గుంటు మల్లన్న ఆలయంలో హరితోత్సవం

ఖమ్మం త్రీటౌన్ ట్రంక్ రోడ్డులోని శ్రీగుంటుమల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన మొక్క నాటారు. కార్యక్రమాల్లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షకురాలు రెంటాల సమత, ఈఓల సంఘం ప్రతినిధి కొత్తూరి జగన్మోహన్‌రావు, అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు దాములూరి వీరభద్రరావు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వర్లు, దాములూరి కృష్ణశర్మ, ఆనంద్, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలుచుకునే అశ్వాపురంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్‌కాలనీలో మంగళవారం నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఒడిశాలో జరిగే పూరీ జగన్నాథుడి రథయాత్రకు అనుసంధానంగా ఏటా ఇక్కడ కూడా రథయాత్ర, ఉత్సవాలు నిర్వహిస్తారు. హెవీ వాటర్ ప్లాంట్‌లో విధులు నిర్వర్తించే ఒడిశా రాష్ట్రానికి చెందిన అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యాన ఏర్పడిన ఉత్కల్ పతాగర్ సమితి ఆధ్వర్యాన ఈ నెల 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజైన మంగళవారం ఉదయం ఉత్కల్ పతాగర్ మండపం నుంచి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను గుండిచాఘర్ మందిరానికి తీసుకొచ్చి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనుండగా, ఈనెల 28న బాహుడా యాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా, తొలిరోజు పూజలో జీఎం కేవీ థాలే పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

గిరిజన విద్యాసంస్థల్లో ఉన్నత విద్య



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పీఓ గౌతమ్ పోట్రు, అధికారులు

జేఈఈ ర్యాంకర్లను అభినందించిన ఐటీడీఏ పీఓ

భద్రాచలం: గిరిజన గురుకులాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే కాక ఉన్నత విద్య అందిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గిరిజన విద్యార్థులు పలువురు ర్యాంకులు సాధించగా పీఓ సోమవారం వారిని అభినందించి మాట్లాడారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భద్రాచలం గిరిజన గురుకులానికి చెందిన కోర్స లక్ష్మి 1,326 ర్యాంకు, రఘునాథపాలెం ఎస్ఓఈ విద్యార్థి బి.ప్రవీణ్ ఎస్టీ విభాగం నుంచి 63, జె.బాలాజీ 380, డి.శివాజీ 438 ర్యాంకు సాధించగా, 1,500 లోపు ర్యాంకులను మరో 12 మంది విద్యార్థులు పొందారని తెలిపారు. ఇంకా దమ్మపేట, కిన్నెరసాని గురుకులం విద్యార్థులు క్వాలిఫై అయ్యారని పేర్కొన్నారు. వారితో పాటు ఇంటర్‌లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను కూడా పీఓ సన్మానించారు. ఈ విజయంలో కీలకమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ (జనరల్), డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాళ్లు ఎం.బాలస్వామి, ఎం.దేవదాసు, ఎస్.రవికుమార్, జానూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం రావొద్దు

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులను ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించొద్దని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొని గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం మాత్రం దరఖాస్తులు సమర్పించాలని, అర్హులందరికీ అందేలా చూస్తామని తెలిపారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో సీట్లను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. ఎస్ఓ సురేశ్‌బాబు, అధికారులు భాస్కరన్, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, నరేందర్, ప్రమీలబాయి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యాన్ని విడనాడాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



కూసుమంచి : మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

కూసుమంచి: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి విడనాడాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. కూసుమంచిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మెడికల్ బిల్లుల మంజూరుకు సైతం ఆరు నెలలకు సమయం పడుతోందని తెలిపారు. వీటితో పాటు ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు దేవేందర్‌తో పాటు మల్లయ్య, భాస్కర్, రాంకోటి, నర్సింహారావు, భద్రూ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నేళ్లు పడుతుంది?

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ఇప్పుడు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని నిర్వహించడం గర్హనీయమని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ కమిటీ సమావేశం సోమవారం జూమ్ యాప్ ద్వారా జరగగా ఆయన మాట్లాడారు. టీఆర్‌టీ ద్వారా ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తుండడంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ బలహీనపడుతుందని తెలిపారు. మన ఊరు – మన బడి పథకం ద్వారా ఏటా వెయ్యి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న ప్రభుత్వం అన్ని పాఠశాల్లో పనులు పూర్తిచేయడానికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.రాజు, హరిలాల్, రామాచారి, శ్రీనివాస్, రాంబాబు, రమేష్, గంగరాజు, ఉమాదేవి, బాలు, కృష్ణబాబు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.